సాక్షి జగిత్యాల

శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024



రైతులకు మద్దతు ధర

వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన పంటలకు కేంద్ర ప్రభుత్వం పెంచిన మద్దతు ధరలు అందనున్నాయి. 8లో▸



పనులు పూర్తయ్యేదెన్నడో..?

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, ప్రైవేటుకు దీటుగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం మనఊరు–మన బడి పథకానికి శ్రీకారం చుట్టింది. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.0/22.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. చలిగాలులు కొనసాగుతాయి.

స్వాహాకార సంఘం!

- సహకార సంఘాల నిధుల పక్కదారి
- జగిత్యాల జిల్లాలో రూ.7.36 కోట్ల గోల్‌మాల్‌
- ఆరుగురు సింగిల్‌ విండో సీఈవోలపై వేటు
- పాలకవర్గాలకు షోకాజ్‌ నోటీసులు
- నిష్పక్ష విచారణకు మంత్రి తుమ్మల ఆదేశాలు



సాక్షిప్రతినిధి, కరీంనగర్‌:

జగిత్యాల జిల్లాలోని సహకారం సంఘాల్లో కుంభకోణం ఆలస్యంగా వెలుగుచూసింది. జిల్లాలోని ఆరు సహకార సంఘాలతోపాటు రెండు డీసీఎంఎస్‌ శాఖల్లో రూ.7.36 కోట్లు గోల్‌మాల్‌ అయినట్లు సమాచారం. ఇందుకు ఆరుగురు సీఈవోలను బాధ్యులుగా గుర్తించిన ప్రభుత్వం వారిని సస్పెండ్‌ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే అవకతవకల్లో బాధ్యులైన సహకార సంఘాల పాలకవర్గాలకు షోకాజ్‌ నోటీసులు జారీ చేసింది. మల్లాపూర్‌ మండలంలోని సిరిపూర్‌ వంటి ఒక్కటి రెండు సంఘాల సీఈవోలపై కూడా వేటు పడనున్నట్లు సమాచారం. కుంభకోణం విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీరియస్‌ అయ్యారని సమాచారం. ఆయన సూచనల మేరకే అధికారులు బాధ్యులపై చర్యలు తీసుకున్నారు. మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరపాలని కూడా మంత్రి తుమ్మల ఆదేశించడంతో ఈ విషయం జిల్లాలో హాట్‌ టాపిక్‌గా మారింది.

అసలేం జరిగింది?

రాష్ట్ర సహకార కమిషనర్‌కు జిల్లాలో పలు సంఘాల్లో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదు అందింది. ఓ ముఖ్య నాయకుడు ఈ వ్యవహారంపై సీరియస్‌ అవడంతోనే ఈ ఫిర్యాదు ప్రభుత్వానికి చేరింది. దీంతో కమిషనర్‌ ఈనెల 9 ఫిర్యాదును స్వీకరించి, ఆయా సంఘాలపై విచారణ జరిపేందుకు హైదరాబాద్‌, రంగారెడ్డి జిల్లాలకు చెందిన అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌, సీనియర్‌ ఇన్‌స్పెక్టర్‌తో కూడిన 8 బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు ఈనెల 10 నుంచి 22 వరకు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఈనెల 23న సహకార కమిషనర్‌కు నివేదిక అందించాయి.

ఆరు సంఘాల్లో అవకతవకలు..

జిల్లాలోని ధర్మపురి, జైనా, తిమ్మాపూర్‌, గొల్లపల్లి, నంచర్ల, పెగడపల్లి సహకార సంఘాలతోపాటు డీసీఎంఎస్‌ ధర్మపురి బ్రాంచ్‌, డీసీఎంఎస్‌ గొల్లపల్లి బ్రాంచ్‌లో భారీగా అవకతవకలు జరిగినట్లు తెలిసింది. ఈ మేరకు ప్రభుత్వానికి అందిన నివేదిక ప్రకారం.. పెగడపల్లి సహకార సంఘంలో రూ.1,81,45,068, నంచర్ల సహకార సంఘంలో రూ.96,12,148, తిమ్మాపూర్‌ సహకార సంఘంలో రూ.67,18,387, జైనా సహకార సంఘంలో రూ.1,55,98,449, ధర్మపురి సహకార సంఘంలో రూ.1,62,19,187, గొల్లపల్లి సహకార సంఘంలో రూ.53,58,809 అవకతకవలు జరిగినట్లు తెలిసింది. అలాగే డీసీఎంఎస్‌ ధర్మపురి బ్రాంచ్‌లో రూ.6,46,377, డీసీఎంఎస్‌ గొల్లపల్లి బ్రాంచ్‌లో రూ.13,07,456 అవకతవకలు జరిగినట్లు సమాచారం.

ఆరు సంఘాల కార్యదర్శుల సస్పెన్షన్‌

ఆయా సంఘాల్లో జరిగిన అవకతవకలకు బాధ్యులను చేస్తూ ఆరు సంఘాల సీఈవోలు జి. ప్రభాకర్‌ (తిమ్మాపూర్‌), అయ్యోరి రాజేశ్‌ (ధర్మపురి), బి.రాంసుధాకర్‌రావు(గొల్లపల్లి), టి.గోపాల్‌ రెడ్డి (పెగడపల్లి), బి.సాగర్‌రావు(జైనా), ఆర్‌.మధుకర్‌ (నంచర్ల)ను సస్పెండ్‌ చేస్తూ గురువారం ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు జిల్లా సహకార అధికారి సిహెచ్‌.మనోజ్‌ కుమార్‌ ఆయా సంఘాలను సందర్శించి సీఈవోలకు సస్పెన్షన్‌ ఉత్తర్వులు అందించారు. దీంతోపాటు ఆయా పాలకవర్గాలకు సైతం వారం రోజులు సమాధానం ఇవ్వాలని షోకాజ్‌ నోటీసులు అందించారు. అలాగే ఆయా సంఘాల్లో జరిగిన పరిణామాలపై సర్వసభ్య సమావేశం నిర్వహించి తీర్మానాలు చేయాలని ఆదేశించారు. దీంతో ధర్మపురి, గొల్లపల్లి డీసీఎంఎస్‌లో జరిగిన అవకతవకలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని పాలకవర్గానికి సిఫారసు చేశారు.

నిధులతో అడ్డగోలు ఖర్చు..

అధికారుల అనుమతి లేకుండా పాలకవర్గాలు తీర్మానాలు చేస్తూ.. కోట్లాది రూపాయలతో సంఘ భవనాలు నిర్మించడం, గోదాములు నిర్మించడం, ధాన్యం కొనుగోలులో పరికరాలను మార్కెటింగ్‌ శాఖ అనుమతి లేకుండా కొనుగోలు చేయడం, ఇష్టారాజ్యంగా పెట్రోల్‌బంక్‌లు ఏర్పాటు చేయడం, భూములు కొనుగోలు చేయడం, సంఘం భవనాలను రిమోడలింగ్‌ చేయడం వంటి పనుల్లో అవినీతికి పాల్పడ్డారని ప్రభుత్వం గుర్తించినట్లు సమాచారం. థర్డ్‌ పార్టీ సర్వే లేకుండా ఇష్టారాజ్యంగా సంఘాల నిధులు ఖర్చు చేశారని ఆరోపణలూ గుప్పుమంటున్నాయి.

సస్పెన్షన్‌ వాస్తవమే



జిల్లాలోని ఆరుగురు సీఈవోలను సస్పెండ్‌ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం వాస్తవమే. పాలకవర్గాలకు సైతం నోటీసులు జారీ చేయాలని సూచించింది. జిల్లాలో మరో రెండు, మూడు సంఘాలు అవకతవకలకు పాల్పడినట్లు తెలిసింది. వాటిపై కూడా త్వరలో చర్యలు ఉంటాయి.

– మనోజ్‌కుమార్‌, జిల్లా సహకార అధికారి, జగిత్యాల

ఆరోగ్యంతో చెలగాటం

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఆహార విక్రయ సెంటర్లు
- పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలు
- కల్తీతో చిత్తవుతున్న జనం
- మొక్కుబడి తనిఖీలకే పరిమితమవుతున్న అధికారులు



మెట్‌పల్లి: పట్టణంలోని పలు పానీపూరీ బండ్ల వద్ద మున్సిపల్‌ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పరిశుభ్రత పాటించడం లేదని, చేతులకు గ్లౌజులు వినియోగించడం లేదని గుర్తించి జరిమానా విధించారు. మరోసారి ఇలా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. ఇది జరిగి నెల అవుతోంది. అయినా నిర్వాహకుల్లో మార్పుమాత్రం రాలేదు. చేతులకు గ్లౌస్‌లు లేకుండానే పానీపూరీ అందిస్తున్నారు. చాలాచోట్ల రహదారుల పక్కన అపరిశుభ్రత వాతావరణంలోనే విక్రయాలు జరుపుతుండడం గమనార్హం.

పట్టణంలో బయట ఆహారం తినేముందు ఒకటికి పదిసార్లు ఆలోచించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. చాలామంది అవగాహన లేక కల్తీ ఆహార పదార్థాలు తింటూ అనారోగ్యం పాలవుతున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, పానీపూరీ బండ్లు, ఫాస్ట్‌ఫుడ్‌ సెంటర్ల నిర్వాహకులు ఏ మాత్రమూ నాణ్యతాప్రమాణాలు పాటించడం లేదు. పలుమార్లు మున్సిపల్‌, ఫుడ్‌సేఫ్టీ అధికారులు జరిపిన తనిఖీల్లో ఇవి బహిర్గతం అయ్యాయి. ఆ సమయంలో జరిమానాలు విధిస్తున్న అధికారులు.. తర్వాత వాటివైపు చూడడం లేదు. దీంతో నిర్వాహకులు కొన్ని రోజులపాటు ప్రమాణాలు పాటించి ఆ తర్వాత వాటికి తిలోదకాలిస్తున్నారు.

పుట్టగొడుగుల్లా విక్రయ కేంద్రాలు

- పట్టణం రోజురోజుకూ విస్తరిస్తోంది. మల్లాపూర్‌, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి మండలాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం మెట్‌పల్లికి వస్తుంటారు.
- రద్దీ ఎక్కువగా ఉండడాన్ని దృష్టిలో పెట్టుకొని ఆహార విక్రయ సెంటర్లు పుట్ట గొడుగుల్లా వెలిశాయి.
- టిఫిన్‌ సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, బజ్జీ, పానీపూరీ బండ్లు అన్ని కలిసి సుమారు ఐదు వందల వరకు ఉంటాయి.
- ఇందులో ఎక్కువగా అనుమతి లేకుండా నిర్వహిస్తున్నవే.

కానరాని ప్రమాణాలు

- నిర్వాహకులు పదార్థాల తయారీలో రుచి కోసం ఎక్కువగా సింథటిక్‌ రంగులు కలుపుతున్నారు
- ఫ్రిజ్‌లల్లో రోజుల తరబడి నిల్వ ఉంచిన ఆహారం.. ముఖ్యంగా నాన్‌వెజ్‌ పదార్థాలను వేడి చేసి ఫ్రెష్‌ పేరుతో అంటగడుతున్నారు
- కుళ్లిన కూరగాయలు, నాసిరకం సరుకులు వినియోగిస్తున్నారు
- కిచెన్‌తోపాటు ఇతర పరిసరాల్లో పరిశుభ్రత పాటించడం లేదు
- వంటల్లో నాణ్యమైన నూనెను వినియోగించకపోవడం.. వాడిన నూనెను పదేపదే వాడడం చేస్తున్నారు
- తోపుడు బండ్ల మీద విక్రయించే ఆహార పదార్థాల విషయంలో సరైన చర్యలు తీసుకోకపోవడంతో వాటిపై దుమ్ము లేచి పడుతోంది.

తనిఖీలు నామమాత్రమే..

- ఆహార కల్తీ నిరోధక శాఖలో సిబ్బంది కొరత ఉంది. తద్వారా ఉన్న అధికారులు ఏడాదిలో ఒకటి, రెండుసార్లు మాత్రమే తనిఖీలు నిర్వహిస్తున్నారు
- మున్సిపల్‌ సిబ్బంది తరుచూ తనిఖీలు చేస్తున్నా నిర్వాహకుల్లో మార్పు రావడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- కేవలం జరిమానా విధించి వదిలేస్తుండడంతో నిర్వాహకుల వైఖరి మారడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చర్యలు తీసుకుంటాం

హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్‌ సెంటర్ల నిర్వాహకులతోపాటు ఇతర ఆహార విక్రయదారులు ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి. తప్పనిసరిగా పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించాలి. లేకుంటే చర్యలు తప్పవు. పానీపూరీ బండ్లల్లో మరోసారి తనిఖీలు జరుపుతాం. ప్రమాణాలను ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తాం.

– ప్రవీణ్‌, మున్సిపల్‌ హెల్త్‌ అసిస్టెంట్‌

న్యూస్‌రీల్‌

ఐలమ్మ పోరాట యోధురాలు

- ప్రభుత్వ విప్‌ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌




మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్‌

గొల్లపల్లి: చాకలి ఐలమ్మ పోరాటయోధురాలని ప్రభుత్వ విప్‌ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ అన్నారు. గురువారం ఆమె జయంతి సందర్భంగా మండలకేంద్రంలోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రజాకర్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఉక్కు మహిళ అని, తెలంగాణ మలిదశ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఆమె ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు ముస్కు నిషాంత్‌రెడ్డి, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ బీమ సంతోష్‌, రజక సంఘం పట్టణ అధ్యక్షుడు కలకోట సత్యం, వైస్‌ చైర్మన్‌ నేరెల్ల మహేశ్‌, నాయకులు చిర్ర గంగాధర్‌, సత్యనారాయణ, వెంకటేశ్‌, తిరుపతిరెడ్డి, లక్ష్మణ్‌ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులపై కేసులు ఎత్తేయండి

- మంత్రి పొన్నంకు ఎమ్మెల్సీ లేఖ



ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న ఆర్టీసీ కార్మికులు

జగిత్యాలటౌన్‌: హక్కుల సాధన కోసం సమ్మె చేసిన ఆర్టీసీ కార్మికులపై గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. తమపై కేసులను ఎత్తేసేందుకు సహకరించాలని కోరుతూ గురువారం ఆర్టీసీ కార్మికులు ఎమ్మెల్సీని కలిసి వినతిపత్రం సమర్పించారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన ఆయన పొన్నంకు లేఖ రాశారు. హక్కుల కోసం సమ్మె చేసిన తమను మభ్య పెట్టడానికి ప్రగతిభవన్‌కు పిలిపించుకుని భోజనం పెట్టి నయవంచన చేశారని ఆరోపించారు. తమ సమస్యపై స్పందించి రవాణాశాఖ మంత్రికి లేఖ రాసిన జీవన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కండక్టర్లు పద్మ, ఉమ, లక్ష్మణ్‌ తదితరులు ఉన్నారు.

జిల్లాకేంద్రంలో భారీ వర్షం

జగిత్యాల: జిల్లా కేంద్రంలో సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మేఘాలు కమ్ముకున్నప్పటికీ సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. అప్పటివరకు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు భారీ వర్షంతో ఉపశమనం లభించినట్లయ్యింది.

ముగిసిన దేవి వైభవ ప్రవచనాలు



ప్రవచనాలు ఇస్తున్న విషుశర్మ

జగిత్యాలటౌన్‌: పట్టణంలోని శ్రీషిర్డిసాయి బాబా మందిరంలో వారంరోజులుగా వైభవంగా సాగిన తిగుళ్ల విషుశర్మ ప్రవచనాలు గురువారం శివపార్వతుల కల్యాణంతో ముగిశాయి. అనంతరం ఆలయ పక్షాన భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పౌరాణిక జ్యోతిష్య పండితులు నంబి వేణుగోపాలచార్య కౌశిక, ఆలయ అధ్యక్షుడు సతీష్‌కుమార్‌, నిర్వాహకులు మార లక్ష్మీనారాయణ, మార రాజేశం, మార కైలాసం, తవుటు రాంచంద్రం పాల్గొన్నారు.

ఫుట్‌బాల్‌ జట్టు ఎంపిక



ఎంపికైన బాలికల జట్టు

జగిత్యాలటౌన్‌: ఫుట్‌బాల్‌ జట్టుకు ఎంపిక పోటీలను పట్టణంలోని వివేకానంద మినీస్టేడియంలో నిర్వహించారు. అండర్‌–14, అండర్‌–17 బాలబాలికలకు పోటీలు నిర్వహించినట్లు జిల్లా విద్యాధికారి గురువారం తెలిపారు. పోటీల్లో ఎంపికైనవారు త్వరలో జరిగే ఉమ్మడి జిల్లా పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్‌ కార్యదర్శి లక్ష్మీరాంనాయక్‌, పెటా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పడాల విశ్వప్రసాద్‌, ఎస్‌.అశోక్‌, పీడీలు, పీఈటీలు పడాల క్రిష్ణప్రసాద్‌, శ్రీనివాస్‌, అజయ్‌బాబు, కోటేశ్వర్‌, విద్యాసాగర్‌, వేణు, భాస్కర్‌, శ్రీరాం పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు మధ్యాహ్న భోజనం

- పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు అండగా ఉంటా
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ వెల్లడి



యువకులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాలటౌన్‌: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు అన్ని విధాలుగా అండగా ఉంటానని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ తెలిపారు. దూర ప్రాంతాల నుంచి ప్రిపరేషన్‌ కోసం గ్రంథాలయానికి వచ్చే యువతకు మధ్యాహ్న భోజనం కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం జిల్లాకేంద్రంలోని ప్రధాన లైబ్రరీలో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించారు. యువతతో కలిసి భోజనం చేశారు. అనంతరం మాట్లాడుతూ లైబ్రరీలో పోటీపరీక్షల మెటీరియల్‌ అందుబాటులో ఉంచామన్నారు. అదనపు గది నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువకులు ఎమ్మెల్యేకు ఆయన చిత్రపటాన్ని బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్‌ శకుంతల, నాయకులు చెట్‌పల్లి సుధాకర్‌, ప్రభాత్‌ సింగ్‌, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువ టూరిజం క్లబ్‌తో పర్యాటక స్ఫూర్తి

- ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌ రామకృష్ణ



జగిత్యాల ఖిలాను సందర్శిస్తున్న విద్యార్థులు

జగిత్యాల: యువ టూరిజం క్లబ్‌తో పర్యాటక స్ఫూర్తి లభిస్తుందని జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌ రామకృష్ణ అన్నారు. గురువారం యువ టూరిజం క్లబ్‌తో డిగ్రీ విద్యార్థులు జిల్లా కేంద్రంలోని ఖిలా, ధర్మపురి నృసింహస్వామి ఆలయం, పొలాసలోని శిలాశాసనం, గోదావరి నదిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క విద్యార్థి చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. జగిత్యాల వెయ్యి ఏళ్ల కిందటే పొలవాస రాజ్యం పేరుతో ప్రసిద్ధి చెందిందని, జగత్‌ ప్రసిద్ధులైన సమ్మక్క సారక్కలు పొలవాస రాజ్యపాలకులైన మేడరాజు కూతురని, పొలవాస పాలకుడు జగదేవుని పేరిట వెలిసిందే జగిత్యాల అని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌ జమున, చంద్రయ్య, రష్మిక, ప్రమోద్‌ పాల్గొన్నారు.

సీఎం నోరు తెరిస్తే తిట్ల పురాణం

- ఇప్పటివరకు ఒక్కమంచి మాట మాట్లాడలేదు
- బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌ రావు
- కాంగ్రెస్‌ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన కౌన్సిలర్‌



కౌన్సిలర్‌ను ఆహ్వానిస్తున్న విద్యాసాగర్‌ రావు

కోరుట్ల: సీఎం రేవంత్‌ రెడ్డి నోరు విప్పుతే తిట్ల పురాణం తప్ప ఏ ఒక్క మాట మంచిగా మాట్లాడిన దాఖలాలు లేవని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌ రావు అన్నారు. కోరుట్లకు చెందిన కౌన్సిలర్‌ ముజాఫర్‌ అహ్మద్‌ (సజ్జు) కొద్దిరోజుల క్రితం బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెల్సిందే. గురువారం విద్యాసాగర్‌ రావు సమక్షంలో తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం విద్యాసాగర్‌ రావు మాట్లాడుతూ తెలంగాణ రాకముందు రాష్ట్రం ఎలా ఉండేది..? బీఆర్‌ఎస్‌ అధికారంలోకి వచ్చాక ఎలా ఉంది..? ఎంత అభివృద్ధి జరిగింది..? కాంగ్రెస్‌ పాలనలో ఏమవుతోందో ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం హైడ్రాపై పెట్టిన దృష్టి ప్రజాసంక్షేమంపై పెడితే బాగుంటుందని హితవు పలికారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్‌, నాయకులు ఫయీం, మురళి, కౌన్సిలర్లు సత్యం, బట్టు సునీల్‌, తదితరులు పాల్గొన్నారు.

రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలి



భరతమాత కూడలి వద్ద నినాదాలు చేస్తున్న రైతు సంఘం ప్రతినిధులు

- అర్హుల పేరిట షరతులు పెట్టొద్దు
- అక్టోబర్‌ 4న కలెక్టరేట్‌ ముట్టడి
- రైతులు పెద్ద ఎత్తున తరలిరండి
- రైతు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నల్ల రమేశ్‌ రెడ్డి

మల్లాపూర్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ వర్తింపచేయాలని రైతు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నల్ల రమేశ్‌రెడ్డి, చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి, రాష్ట్ర రైతు సంఘం నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి డిమాండ్‌ చేశారు. గురువారం మండలకేంద్రంలోని భరతమాత కూడలి వద్ద రైతులతో కలిసి ధర్నా చేశారు. కాంగ్రెస్‌ పార్టీ రైతు డిక్లరేషన్‌ సభలో.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందని, పార్లమెంట్‌ ఎన్నికల సభల్లోనూ సీఎం రేవంత్‌రెడ్డి వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఎలాంటి షరతులు, కటాఫ్‌ డేట్లు లేకుండా రూ.2లక్షల రుణాలను రైతులందరికీ మాఫీ చేయాలని, రైతు భరోసా సాయం ఎకరానికి రూ.7,500 విడుదల చేయాలని కోరారు. దొడ్డు వడ్లకు కూడా క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. డిమాండ్ల సాధన కోసం అక్టోబర్‌ 4న రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించే కలెక్టరేట్‌ ముట్టడికి రాజకీయాలకు అతీతంగా రైతులందరూ పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు కమిటీ మండల మాజీ అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, నోముల నరసింహారెడ్డి, ఎలిసె పాపన్న, గడ్డం రాజరెడ్డి, బద్దం మహేందర్‌, బందెల మల్లయ్య, న్యావనంది లింబారెడ్డి, నల్ల నారాయణ, మొరపు జలపతి, బండి లింగస్వామి, గడ్డం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వీరనారి చాకలి ఐలమ్మ



ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్‌ సత్యప్రసాద్‌, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌



ఎస్పీ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్‌



ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధికారులు

జగిత్యాలటౌన్‌/జగిత్యాల క్రైం: చాకలి ఐలమ్మ తెగువ భావితరాలకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్‌ సత్యప్రసాద్‌, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లాకేంద్రంలోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈతరం విద్యార్థినులు, మహిళలు ఆమెను స్ఫూర్తిగా తీసుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. ముందుగా అదనపు కలెక్టర్‌ పి.రాంబాబు, ఆర్డీవో మధుసూదన్‌, డీపీవో రఘువరన్‌ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నివాళి అర్పించారు. అదనపు కలెక్టర్‌ గౌతంరెడ్డి, బల్దియా చైర్‌పర్సన్‌ అడువాల జ్యోతి, కమిషనర్‌ సమ్మయ్య, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎస్పీ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి ఎస్పీ అశోక్‌కుమార్‌ పూలమాల వేసి నివాళులర్పించారు. అడిషనల్‌ ఎస్పీ భీంరావు, ఏవో శశికళ, డీఎస్పీ రవీంద్రకుమార్‌, డీసీఆర్బీ ఎస్పీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌, ఆరీఫ్‌ అలీఖాన్‌, ఆర్‌ఐలు రామకృష్ణ, వేణు, ఆర్‌ఎస్సైలు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: కారు కొనివ్వలేదని మనస్తాపానికి గురైన కరీంనగర్ జిల్లా గంగాధర మండలం రాగెల్ల గ్రామానికి చెందిన బేతపు వంశీ (20) ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన బేతపు రాజలింగయ్య కుమారుడు వంశీ. తనకు కారు కొనివ్వాలని కొద్దిరోజులుగా కోరుతున్నాడు. తల్లిదండ్రులు నిరాకరించడంతో ఈనెల 23న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రెండురోజులైనా ఆచూకీ లేకపోవడంతో కుటుంబసభ్యులు గంగాధర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గురువారం జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ శివారులో చెట్టుకు ఓ వ్యక్తి మృతదేహం వేలాడుతూ కనిపించగా.. గొర్రెలకాపరులు రూరల్ పోలీసులకు సమాచారం అందించా రు. రూరల్ ఎస్సై సదాకర్ అక్కడకు చేరుకుని విచారణ చేపట్టి వంశీగా గుర్తించారు. రాజలింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సదాకర్ తెలిపారు.

గోదావరిలో మునిగి భక్తురాలి మృతి


భూలక్ష్మి మృతదేహం

ధర్మపురి: గోదావరిలో పుణ్యస్నానాలకు వచ్చిన ఓ భక్తురాలు స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందిన ఘటన ధర్మపురిలో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన కడారి భూలక్ష్మి (67) పుణ్యస్నానాల కోసం గురువారం వచ్చింది. గోదావరిలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయింది. మహాలక్ష్మి ఘాట్ వద్ద ఆమె శవమై కనిపించింది. జాలర్ల సాయంతో శవాన్ని బయటకు తీయించారు. మృతురాలి అల్లుడు మ్యాక బీరయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజ్య పురస్కారానికి 'పారమిత' విద్యార్థులు


పారమిత స్కూల్ స్కౌట్స్ అండ్ గైడ్స్

కరీంనగర్: నగరంలోని పారమిత ఉన్నత పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ టెస్టింగ్ క్యాంపులో ప్రతిభ కనబరిచారని హెచ్ఎం బాలాజీ తెలిపారు. ఈ నెల 19 నుంచి 25 వరకు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో, కరీంనగర్ జిల్లా చింతకుంట ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన క్యాంపులో 7, 8వ తరగతుల విద్యార్థులు 13మంది స్కౌట్స్, ఆరుగురు గైడ్స్ సత్తాచాటి, రాష్ట్ర అత్యున్నత రాజ్యపురస్కారానికి అర్హత సాధించారని పేర్కొన్నారు. త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించే అభినందన సభలో పురస్కారం అందుకోనున్నారని తెలిపారు. వీరిని విద్యాసంస్థల అధినేత ఇనుగంటి ప్రసాద్‌రావు, డైరెక్టర్స్ ప్రసూన, అనుకర్‌రావు, వీ.యూ.ఎం.ప్రసాద్, టీఎస్వీ.రమణ, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, కవిత, స్కౌట్స్ అండ్ గైడ్ కెప్టెన్ రజిత, స్కౌట్స్ మాస్టర్ శ్రీను నాయక్ అభినందించారు.

పాఠశాలల పనులు పూర్తయ్యేదెన్నడో..?

- గతంలో మనఊరు–మన బడి కింద పనులు
- తాజాగా 'అమ్మ ఆదర్శ కమిటీ' పేరిట నిధులు
- ఇంకా శిథిలావస్థలోనే తరగతి గదులు
- పనులు పూర్తయినచోట బిల్లులు రాని వైనం


ఈ చిత్రంలో కనిపిస్తున్నది బుగ్గారం మండలంలోని జెడ్పీహెచ్ఎస్‌లోనిది. పిల్లలకు తాగునీటి సౌకర్యం కల్పించడంతో వివిధ అభివృద్ధి పనులు చేసేందుకు ప్రభుత్వం రూ.35లక్షలు కేటాయించింది. ఇప్పటివరకు రూ.25లక్షల పనులు మాత్రమే పూర్తి అయ్యాయి. అలాగే మద్దునూర్ పాఠశాలలో సదుపాయాలకు రూ.40లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేయగా పనులు ప్రారంభమే కాలేదు. ఇప్పటివరకు పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల జారీలో జాప్యం జరుగుతున్న క్రమంలో మిగిలిన పనులను పూర్తి చేసేందుకు ముందుకు రావడం లేదు. వెల్గొండలోనూ పనులు ప్రారంభం కాలేదు.

బుగ్గారం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, ప్రైవేటుకు దీటుగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మనఊరు–మన బడి పథకానికి శ్రీకారం చుట్టింది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు రూ.7,289 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో టాయిలెట్లు, విద్యుదీకరణ, తాగునీరు, విద్యార్థులు, సిబ్బందికి సరిపడా ఫర్నిచర్, తరగతి గదుల గోడలకు పెయింటింగ్, గ్రీన్ చాక్‌బోర్డులు, ప్రహరీల నిర్మాణం, కిచెన్ షెడ్లు, డైనింగ్ హాల్, డిజిటల్ సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఈ పనులన్నీ మూడేళ్లలో పూర్తి చేయాలని సంకల్పించింది. అవసరమైన బడ్జెట్ ఖర్చు చేయడానికి.. పనుల నిర్వహణ, పర్యవేక్షణను ఎస్ఎంసీల నుంచి కలెక్టర్ స్థాయి అధికారి వరకు బాధ్యతలు అప్పగించింది.

పూర్తికాని పనులు

మనఊరు–మనబడి పథకం కింద జిల్లాలో 274 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో పనులు ప్రారంభించినా పూర్తిస్థాయిలో సౌకర్యాలు మాత్రం కల్పించలేదు. కేవలం 28 పాఠశాలల్లోనే పనులు పూర్తయ్యాయి. 40 పాఠశాలల్లో 75శాతం, 229 పాఠశాలల్లో 50 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయి. పూర్తిస్థాయిలో పనులు కాకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులే ఎదురయ్యాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మనఊరు మన బడి పథకాన్ని రద్దు చేసి దాని స్థానంలో అమ్మ ఆదర్శ కమిటీ పథకాన్ని ప్రారంభించింది. దీని ద్వారా జిల్లాలోని 517 పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలని సంకల్పించింది. ఇందుకోసం నిధులు విడుదల చేసింది. 390పాఠశాలల్లో పనులు పూర్తికాగా.. ఇంకా 127 పాఠశాలల్లో పనులు ప్రగతిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో జరిగిన పనుల మొత్తం విలువ రూ.18 కోట్లు కాగా.. రూ.10.70 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. అధికారులు చెబుతున్న వివరాలకు భిన్నంగా ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

శిథిలావస్థలో పలు భవనాలు

బీఆర్ఎస్ ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని ప్రారంభించినా.. కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీ కింద నిధులు మంజూరు చేసినా.. ఇంకా జిల్లాలో కొన్ని పాఠశాల భవనాలు శిథిలావస్థలోనే ఉన్నాయి. వాటికి నూతన భవనాలు ఎప్పుడు నిర్మిస్తారో..? విద్యార్థులకు సౌకర్యాలు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో తెలియడం లేదు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి ప్రతీ ఒక్కరికీ నాణ్యమైన ఉచిత విద్య అందించాలనే లక్ష్యం ఎప్పటికి నెరవేరుతుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

పనుల్లో వేగం పెంచాలి



ప్రభుత్వ పాఠశాలలో సిబ్బంది కొరత లేకుండా చూడాలి. సదుపాయాలు కల్పించాలి. ఇప్పటికే పాఠశాలలు అధ్వానంగా మారాయి. వీటిని అభివృద్ధి చేయడానికి పథకాలు తీసుకురావడం మంచిదే అయినా పనులు సకాలంలో పూర్తిచేయకపోవడం సరికాదు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి పరచాలి.
– అక్రం, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

త్వరలోనే పూర్తి



జిల్లాలో మనఊరు మనబడి, అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగవుతున్నాయి. ఇప్పటికే ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. ఉన్నతాధికారుల సహకారంతో త్వరలోనే పెండింగ్ పనులను పూర్తిచేయడానికి కృషి చేస్తాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతులు కల్పించే దిశగా ముందుకెళ్తున్నాం.
– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

దొంగల ఆచూకీ ఎక్కడ ?

- రెండ్రోజుల క్రితం ఓ వ్యక్తి ఇంట్లో చోరీ
- అంతకుముందు వీణవంక వైన్స్, హార్డ్‌వేర్ షాపులో..
- పోలీసులకు సవాల్‌గా మారిన వరుస దొంగతనాలు

వీణవంక: వీణవంక మండలకేంద్రంలో దొంగలు రెచ్చిపోతున్నారు. ఇటీవల జరిగిన వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈనెల 22 న రాత్రి మండలకేంద్రంలోని నల్లపోచమ్మ వైన్స్‌లో రూ.32వేల నగదు, రూ.85వేల మద్యం, సీసీ కెమెరా డీవీఆర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. పక్కనే ఉన్న ఐరన్, హార్డ్‌వేర్ దుకాణాల్లోనూ డీవీఆర్‌తో పాటు కొంతనగదు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. రెండ్రోజుల క్రితం వీణవంకలో చందర్ అనే వ్యక్తి ఇంట్లో తాళం పగులకొట్టి రూ.10వేల నగదు ఎత్తుకెళ్లారు. నాలు గు రోజులైనా దొంగలను పట్టుకోకపోవడంతో పలువురి నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సీసీ ఫుటేజీ లేకుండా...

ఈ రెండు షాపుల్లోనూ దొంగతనానికి పాల్పడిన అనంతరం సీసీ కెమెరాలను దుండగులు రాడ్లతో పగులగొట్టారు. అంతేకాకుండా కెమెరాల రికార్డును పొందుపరిచే డీవీఆర్‌ను సైతం ఎత్తుకెళ్లారు. డీవీఆర్‌ల కోసం దొంగలు వచ్చారా.. లేక డబ్బుల కోసమే దొంగతనానికి పాల్పడ్డారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కో డీవీఆర్ విలువ రూ.15వేల నుంచి రూ.20వేల వరకు ఉండటంతో పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. మద్యం దుకాణంలో తక్కువ ధరగల బాటిళ్లను ఎత్తుకెళ్లడంతో స్థానికుల పనేనని ప్రచారం జరుగుతోంది. మద్యంషాపుకు కూతవేటు దూరంలో తాగిన మద్యం బాటిళ్లు లభించినట్లు తెలిసింది. అయితే నాలుగు రోజులైనా పోలీసులు దొంగల ఆచూకీ కనిపెట్టకపోవడంలో అంతర్యమేంటని పలువురు చర్చించుకుంటున్నారు. అలాగే బేతిగల్‌లో ఏడాదికింద ఆరు దొంగతనాలు జరిగినా ఇప్పటివరకు ఒక్క కేసు కూడా చేధించలేకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కుస్తాపూర్ శివారులో సిమెంట్ లారీ బోల్తా


బోల్తా పడిన సిమెంట్ లారీ

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని కుస్తాపూర్ శివారులో గురువారం సిమెంట్ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికుల కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా నంద్యాల నుంచి లారీ సిమెంట్ లోడ్‌తో మల్లాపూర్ మండల కేంద్రానికి వస్తోంది. కుస్తాపూర్ శివా రులో రోడ్డుపై మొక్కజొన్నలు ఆరబెట్టారు. అతివేగంగా వస్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీ సులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

జీడీకే-11గనిలో కూలిన పైకప్పు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–11గనిలో గురువారం గని పై కప్పు కూలింది. గనిలోని 1వ సీమ్ కంటి న్యూస్ మైనర్–2ఏలో రిమోట్ ద్వారా కోల్‌కటింగ్ చేస్తుండగా అకస్మాత్తుగా మూడు మీటర్ల మందంతో సుమారు 5 మీటర్ల వెడల్పుతో పైకప్పు కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. బొగ్గుపొరల్లో చిక్కుకున్న యంత్రాన్ని బయటకు తీసేందుకు అధికారులు దగ్గరుండి పనులు పర్యవేక్షిస్తున్నారు.

బాలుర ఓవరాల్ చాంపియన్ కరీంనగర్

- ఉత్తమ క్రీడాకారులుగా కిరణ్, యశ్వంతిక
- ముగిసిన రాష్ట్రస్థాయి 68వ ఎస్‌జీఎఫ్ జూడో పోటీలు


క్రీడాకారులతో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ, జూడో సంఘం బాధ్యులు, పీడీ, పీఈటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ పోచమ్మమైదాన్‌లోని కెమిస్ట్ భవన్‌లో రెండురోజుల పాటు నిర్వహించిన 68వ పాఠశాల క్రీడల సమాఖ్య రాష్ట్రస్థాయి అండర్ –14 బాలబాలికల జూడో పోటీలు గురువారం ముగిశాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో బాలుర విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా కరీంనగర్ జట్టు నిలిచింది. రెండో స్థానంలో వరంగల్ క్రీడాకారులు నిలిచారు. 25 కేజీల బరువులోపు విభాగంలో నల్లగొండ జిల్లాకు చెందిన కె. కిరణ్‌కుమార్ ఉత్తమ క్రీడాకారుడిగా పతకం అందుకున్నాడు. బాలికల విభాగంలో 40 కేజీల బరువులోపు కేటగిరీలో ప్రతిభ కనబరిచిన కరీంనగర్‌కు చెందిన బి. యశ్వంతిక ఉత్తమ క్రీడాకారిణిగా నిలిచింది.

200 మంది క్రీడాకారులు హాజరు..

23, 27, 32, 36, 40, 44 కేజీల బరువు లోపు కేటగిరీతో పాటు 44కేజీల పైన బరువు కేటగిరీల్లో నిర్వహించిన పోటీలకు ఉమ్మడి పది జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దస్రూనాయక్ తెలిపారు. ఏడు కేటగిరీల్లో జరిగిన పోటీల్లో బంగారు పతకం సాధించిన ఏడుగురు బాలికలు, ఏడుగురు బాలురను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వచ్చే నెల (అక్టోబర్) 3 నుంచి 6వ తేదీ వరకు గుజరాత్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూడో ఫెడరేషన్ బాధ్యులు కైలాస్‌యాదవ్, సంతోష్, రాజు, కిషన్ పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలు అమలు చేసేదాకా పోరాటం సాగిస్తా

- బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంజయ్‌కుమార్

కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా పోరాటం కొనసాగిస్తానని, కుల గణన వెంటనే చేపట్టకపోతే మళ్లీ అమరణ దీక్ష చేస్తానని బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ అన్నారు. దీక్ష అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో బీసీలకు ఇచ్చిన హామీలు అమలు విషయంలో ఎందుకు జాప్యం చేస్తుందో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని అన్నారు. వెంటనే కుల గణన ప్రక్రియ చేపట్టకపోతే మళ్లీ ఆమరణ దీక్షకు సిద్ధమని, రాష్ట్ర వ్యాప్త పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. సంజయ్‌ని దళిత రిప్రజేంటేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లంకల అనిల్ యాదవ్, బీసీ రాజ్యాధికార సమితి నాయకులు జంగిల్ కొమురయ్య, వాసం మల్లేశం, రేవెల్లి అజయ్ పరామర్శించారు.

కోరుట్ల ఎస్సై తీరే వేరు

- విచారణ పేరుతో చేయిచేసుకున్న వైనం
- ఎక్కడ విధులు నిర్వహించినా వివాదాస్పదమే..


ఎస్సై శ్వేత

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కోరుట్ల ఎస్సై –2గా పని చేస్తున్న శ్వేత మరో వివాదంలో చిక్కుకున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తిని అకారణంగా చితకబాదడంతో ఆయన అవమానంతో ప్రాణాలు తీసుకున్న తీరు ఆమె దురుసు ప్రవర్తనను మరోసారి బయటపెట్టింది. చేతిలో అధికారం, లాఠీ ఉన్నాయనో.. లేక పోలీసును.. నాకేమవుతుందన్న ధీమానో తెలియదు గానీ.. ఎక్కడ విధులు నిర్వహించినా జనాలను వేధించే అధికారిగా ముద్ర వేసుకోవడం మానడం లేదు. తాజా ఘటనలో ఓ అమాయకుడు ఎస్సై శ్వేత కారణంగా ప్రాణాలు తీసుకోవడంతో జిల్లా ప్రజలు పోలీసు శాఖపై మండిపడుతున్నారు.

కౌన్సెలింగ్‌కు బదులు లాఠీ ఝులిపించి?

మృతుడి కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన బొల్లారపు శివప్రసాద్‌పై ఆయన భార్య కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఆమె భర్తను విచారణ పేరిట ఎస్సై శ్వేత ఠాణాకు పిలిపించారు. భార్య ముందే లాఠీ ఝులిపించి, దూషిస్తూ అవమానించారు. ఈ నెల 23న ఉదయం ఇంట్లోనే శివప్రసాద్ పెట్రోల్ పోసుకొని, నిప్పంటించుకున్నాడు. కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి చనిపోయాడు. దీంతో ఎస్సై శ్వేతపై మృతుడి కుటుంబసభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అకారణంగా తమ వాడిని పొట్టన పెట్టుకున్న ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గతంలోనూ ఇదే తీరు..

జిల్లాలోని పెగడపల్లి ఠాణాలో ఎస్సైగా పని చేస్తున్న సమయంలోనూ శ్వేత అదే మండలానికి ఓ ప్రజాప్రతినిధిని అప్పటి మంత్రి సమావేశంలో ఉన్నప్పటికీ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి, చితకబాదారు. దీంతో మంత్రి ఆగ్రహించి, ఆమెను బదిలీ చేయించారు. ఎస్సై శ్వేత జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న సమయంలో దరఖాస్తుదారులతోపాటు పోలీస్‌స్టేషన్‌కు వచ్చినవారితో దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపణలున్నాయి. మందలించాల్సిన పోలీస్ ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఆమె చెలరేగిపోతున్నట్లు తెలిసింది.

కొండాలక్ష్మణ్ బాపూజీ జీవితం స్ఫూర్తిదాయకం

- విప్ అడ్లూరి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


కొండా లక్ష్మణ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విప్ అడ్లూరి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

పెగడపల్లి: స్వాతంత్య్ర సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సుద్దపల్లిలో పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. తెలంగాణ సాధన, వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తి అని కొనియాడారు. పద్మశాలీ సంఘం జిల్లా, మండల అధ్యక్షులు రుద్ర శ్రీనివాస్, గాజుల గంగమల్లేశం, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శోభారాణీ, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మీ, మాజీ సర్పంచులు హారిక, నర్సమ్మ, నాయకులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లను మంచికి ఉపయోగించాలి


యువజనోత్సవ వేదికపై మాట్లాడుతున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలటౌన్: ఫోన్ల మోజులో పడి విద్యార్థులు, యువత తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని, ఫోన్లను మంచికి వినియోగించుకుని జ్ఞానాన్ని పెంచుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సూచించారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లాకేంద్రంలోని వివేకానంద మినీస్టేడియంలో నిర్వహించిన యువజనోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. వివిధ విభాగాల్లో విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ఫేర్‌ను పరిశీలించి అభినందించారు. ధైర్యమే విజయానికి తొలిమెట్టు అని, వివేకానందుడి స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. స్టేడియంలో తన సొంత డబ్బులతో వివేకానందుడి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, జగిత్యాల బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ మట్టి తరలింపుపై చర్యలు తీసుకోవాలి


పోతారం శివారుల్లోని గణిగుట్ట నుంచి తరలిస్తున్న మట్టి

సారంగాపూర్: మండలంలోని పోతారం శివారు గణిగుట్ట నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గురువారం గణిగుట్ట నుండి జేసీబీ సహాయంతో ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మట్టి తరలించడంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నా ఆగడం లేదని అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. మట్టి తరలింపుపై అటవీశాఖ, రెవెన్యూ శాఖలు పట్టించుకోవడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

రైతులకు అందనున్న మద్దతు ధర

- వరి ఏ గ్రేడ్‌కు రూ.2,320
- కామన్ రకానికి రూ.2,300
- మొక్కజొన్నకు క్వింటాల్‌కు రూ.2,225


మొక్కజొన్న పంట


జిల్లాలో సాగవుతున్న వరి

గత, ప్రస్తుత మద్దతు ధరలిలా

పంట	2023-24	2024-25
మేలిమి ధాన్యం	2,203	2,320
కామన్ ధాన్యం	2,183	2,300
మొక్కజొన్న	2,090	2,225
సోయాబీన్	4,600	4,892
పత్తి(లాంగ్‌స్టెపుల్)	7,020	7,521
జొన్నలు(హైబ్రిడ్)	3,180	3,300
నువ్వులు	8,635	9,267
పొద్దుతిరుగుడు	6,760	6,900
కందులు	7,000	7,550
వేరుశనగ	6,377	6,783
మినుములు	7,000	7,400
పెసలు	8,300	8,682

జగిత్యాలఅగ్రికల్చర్: వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన పంటలకు కేంద్ర ప్రభుత్వం పెంచిన మద్దతు ధరలు అందనున్నాయి. జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో వరి సాగవుతోంది. తర్వాతి స్థానంలో మొక్కజొన్న పంట ఉంది. వేరుశనగ, పత్తి, సోయాబీన్, నువ్వులు కూడా సాగు చేస్తున్నారు.

వరి మద్దతు ధరపైనే రైతుల ఆశలు

జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేసే వరి ధరపైనే రైతులు ఆశలు పెంచుకున్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్ నుంచి వరికి మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.117పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు రూ.2203 ఉండగా.. ప్రస్తుతం రూ.2,320కు చేరింది. కామన్ రకం క్వింటాల్‌కు రూ.2,183 ఉండగా.. అది రూ.2,300కు పెరిగింది. ఈ ధరల పెంపు పెరుగుతున్న పెట్టుబడి నేపథ్యంలో రైతులకు కొంతమేర ఊరటనిచ్చింది.

వరి రైతులకు రూ.88కోట్ల లాభం

జిల్లాలో ప్రతి సీజన్‌లో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. ఎకరాకు 25 క్వింటాళ్ల చొప్పున దిగుబడి అంచనా వేస్తే 75లక్షల క్వింటాళ్ల ధాన్యం ఉత్పత్తి వస్తుంది. ప్రస్తుతం ఉన్న ధర రూ.2,203 ప్రకారం రైతులకు రూ.1652 కోట్లు వస్తే పెరిగిన ధర రూ.2320 ప్రకారం రైతులకు రూ.1740 కోట్లు రానున్నాయి. ఈలెక్కన జిల్లా రైతులకు వానాకాలం సీజన్ నుంచి అదనంగా రూ.88 కోట్లు చేతికి అందనున్నాయి. వరికి మద్దతు ధర పెరగడంతో వానాకాలం సీజన్‌లో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో దొడ్డు ధాన్యాన్ని సాగుచేశారు. దొడ్డు ధాన్యాన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసే అవకాశం ఉంది.

మొక్కజొన్నకు క్వింటాల్‌కు రూ.2225

మొక్కజొన్న పంట ఇప్పుడిప్పుడే చేతికొస్తోంది. మొక్కజొన్నను జిల్లాలో దాదాపు 55 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఎకరాకు సగటున కనీసం 30 క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశం ఉంది. మొన్నటివరకు మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.2090 ఉండగా.. ప్రస్తుతం రూ.135 పెంచి రూ.2,225గా నిర్ణయించారు. ఓపెన్ మార్కెట్‌లో మొక్కజొన్నకు డిమాండ్ ఉండటంతో క్వింటాల్‌కు రూ.2600 నుంచి రూ.మూడు వేల వరకు పలుకుతోంది. ఓపెన్ మార్కెట్‌లో ధర లేనప్పుడు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులకు లాభం జరుగుతుంది. గతంలో మొక్కజొన్న రైతులకు రూ.344.85 కోట్ల వరకు రాగా.. ఈ ఏడాది పెరిగిన ధరలతో రూ.367.12 కోట్లు అందనున్నాయి.

సాగు ఖర్చులు రెట్టింపు

పంట సాగు ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పంటకు పెట్టిన పెట్టుబడుల ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధరలు ప్రకటించాల్సి ఉండగా.. కేంద్ర ప్రభుత్వం నామమాత్రంగా పెంచుకుంటూ వెళ్తోంది. గతేడాది క్వింటాల్‌కు రూ.143 పెంచగా.. ఈసారి కేవలం రూ.117 మాత్రమే పెంచింది. మద్దతు ధరలను నిర్ణయించే కేంద్ర వ్యవసాయ ధరల నిర్ణాయక కమిషన్ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల నుంచి అభిప్రాయాలు తీసుకుంటే కొంత మేలు జరిగేది. గతంలో ఉన్న ధరలకే కొంత మొత్తం కలిపి ఇస్తుండటంతో సాగు ఖర్చులకు.. రైతులకు వచ్చే ఆదాయానికి పొంతన ఉండటం లేదు. ఇవేవీ పట్టించుకోకుండా ధరల నిర్ణాయక కమిషన్ సిద్ధం చేసిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం యథాతథంగా అమలు చే యడంతో రైతులకు అంతంతమాత్రంగానే లాభం జరుగుతోంది. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం సాగు ఖర్చుకు రెట్టింపు ఆదాయం రావాల్సి ఉండగా.. కనీసం సాగు ఖర్చులు కూడా రావడం లేదు.

ఏటా రూ.250పెంచాలి



ఏటా వరి పంటకు కనీసం రూ.250 వరకు పెంచుకుంటూ పోవాలి. అప్పుడే వరి రైతులకు న్యాయం జరుగుతుంది. రూ.50, రూ.100 పెంచితే రైతులకు పెద్దగా ప్రయోజనం ఉండదు. కొద్దిమొత్తం పెంచారో లేదోగానీ.. కూలీల ఖర్చు రెట్టింపు అవుతున్నాయి.
– గడ్డం సత్యనారాయణరెడ్డి, జిల్లా ఉత్తమ రైతు, ధర్మపురి మండలం

రైతులను ఆదుకోవాలి



రైతులు పెట్టిన పెట్టుబడికి రెండింతల ఆదాయం రావాలి. అప్పుడే రైతులు నిలదొక్కుకునే అవకాశం ఉంది. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు పంటల ధరలు పెరగడం లేదు. ప్రతి ఏడాది పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధరలు పెరగడం లేదు.
– క్యాతం సాయిరెడ్డి, సింగరావుపేట, రాయికల్